


'ఇళ్ల మధ్య సెల్ టవర్ వద్దు'

వికారాబాద్, ఆగస్టు 10: ప్రజారోగ్యంపై దుష్ప్రభావం చూపే సెల్‌ఫోన్ టవర్‌ను నివాసాల మధ్య ఏర్పాటు చేయొద్దంటూ శనివారం స్థానికులు అడ్డుకున్నారు. వికారాబాద్ పరిధి రామయ్యగూడ ఎంబీజీ కాలనీలో ఓ టెలికాం సంస్థ సెల్‌టవర్ ఏర్పాటుకు పనులు చేపట్టగా కాలనీవాసులు అడ్డుకున్నారు. టవర్ ఏర్పాటుకు అనుతివ్వొద్దని మునిసిపల్ కమిషనర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సెల్ టవర్‌తో మనుషులపై రేడియేషన్ ప్రభావం పడుతుందన్నారు.





అయ్యో పాపం..
అందని జీతం

వేతనాలు రాక 'మోడల్' టీచర్ల నిరీక్షణ

ఆశగా ఎదురు చూస్తున్నాం



నేను 11 సంవత్సరాల నుంచి చేవెళ్ల మోడల్ స్కూల్‌లో గణితం టీచర్‌గా పని చేస్తున్నాను. ఇప్పటి వరకు ఎప్పుడూ జీతాలు ఇలా ఆగలేదు. ఈసారి మూడు నెలలు అవుతున్నా వేతనాలు రాలేదు. ఈఎంఐలు, హౌస్ రెంట్లు కట్టుకునేందుకు ఇబ్బందిగా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి త్వరగా జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

- అనంత, టీజీటీ, చేవెళ్ల మోడల్ స్కూల్

ఒకటో తేదీన రావాల్సిన జీతం రెండు రోజులు ఆలస్యమైతేనే కుటుంబాన్ని నడపడం కత్తిమీద సాములాగా మారుతుంది. అటువంటిది నెలలుగా జీతాలు రాకపోతే ఆ పరిస్థితి చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అదే. బ్యాంకు, హౌసింగ్ రుణాలు, ఈఎంఐలను ఎలా చెల్లించాలో తెలియక నానా అవస్థలు పడుతున్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 5 నెలలు, హాస్టల్ సిబ్బందికి 4 నెలలు, రెగ్యులర్ టీచర్లకు, అవర్ బేస్డ్ టీచర్లకు 3 నెలలుగా వేతనాలు అందలేదు. మొత్తం 18 మోడల్' స్కూకలో 500 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు.

- ఐదు నెలలుగా తప్పని ఎదురుచూపులు
- కుటుంబాలు గడవడం లేదని ఆందోళన
- 010 పద్దు ద్వారా 1వ తేదీనే ఇవ్వాలని డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 18 మోడల్' స్కూళ్లు
- 500 మంది బోధన, బోధనేతర సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10):

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మొత్తం 18 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. అందులో 500 మందికిపైగా బోధన, బోధనేతర సిబ్బంది పని చేస్తున్నారు. అందులో 224 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు, 80 మంది అవర్‌బేస్డ్, 72 మంది అవుట్ సోర్సింగ్, 36 మంది ఒకేషనల్ టీచర్లు పనిచేస్తున్నారు. దీంతో పాటు హాస్టల్స్‌లో మరో 90 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్, శంకర్‌పల్లి, మహేశ్వరం, వికారాబాద్ జిల్లా పరిగి, వికారాబాద్, పెద్దెముల్ మండలాల్లోని మోడల్ స్కూల్స్ మొత్తంగా అవర్‌బేస్డ్ టీచర్లతో కొనసాగుతున్నాయి. మిగితా 14 మోడల్ స్కూల్స్‌లో రెగ్యులర్ ఉపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. ఔట్ సోర్సింగ్ సిబ్బంది, హాస్టల్ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ టీచర్లతో పాటు అవర్ బేస్డ్ టీచర్లకు 3 నెలలుగా, రెగ్యులర్ ఉపాధ్యాయులకూ సకాలంలో వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రెజరీల ద్వారా 010 పద్దు నుంచి వేతనాలు ఇవ్వాలని ఏళ్లగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం వాపోతున్నారు. అలా ఇవ్వకపోవడం వలన ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఆర్థిక శాఖ నుంచి ఆమోదం పొందాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 010 పద్దు ద్వారా ప్రతీ నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని కోరుతున్నారు. దీనికి తోడు 11 సంవత్సరాల నుంచి బదిలీలు లేక ఒకే చోట విధులు నిర్వహిస్తున్నామని, వెంటనే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నెలనెలా వేతనం వస్తేనే కుటుంబం గడిచేది. అలాంటిది నెలలకొద్దీ వేతనాలు రాకుంటే ఎలా అని మోడల్ స్కూల్ ఇంటర్ హాస్టల్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 18 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ఇక్కడ చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థినులకు పక్కనే వసతి గృహాన్ని ఏర్పాటు చేసింది. ఒక్కో మోడల్ హాస్టల్‌లో వంద మంది విద్యార్థినులు ఉంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, షాబాద్, ఇబ్రహీంపట్నం పరిధిలోని బొంగలూరు, శంషాబాద్ మండలంలోని పాల్మాకుల, చాచారం పరిధిలోని గున్‌గల్, మహేశ్వరం, మంచాల పరిధిలోని ఆరుట్ల, కందుకూరు, శంకర్‌పల్లిలో మోడల్ స్కూల్స్ కొనసాగుతున్నాయి. శంకర్‌పల్లి మినహా అన్ని మండలాల్లో ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించారు. అలాగే వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం ఎన్కేపల్లి, తాండూరులోని జిన్‌గుర్తి, పరిగిలోని జార్‌పల్లి, కుల్కచర్ల పరిధిలోని ముజాయత్‌పూర్, నవాబుపేట, మర్పల్లిలో మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో మోడల్ హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థినుల బాగోగులు చూసుకునేందుకు వార్డన్/కేర్ టేకర్ ఉంటుంది. వార్డెన్‌కు/కేర్ టేకర్‌కు నెలకు రూ. 12,500 చొప్పున వేతనాలు ఇస్తున్నారు. వీరికి నాలుగు నెలల వేతనం రావాల్సి ఉంది. అలాగే వాచ్‌మెన్‌కు రూ.8,710, ఏఎన్ఎంకు రూ.7,800, హెడ్ కుక్‌కు రూ.7,800, ఇద్దరు అసిస్టెంట్ కుక్‌లు ఒక్కొక్కరికి రూ.6,500 చొప్పున నాలుగు నెలలకు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

వెంటనే వేతనాలు ఇవ్వాలి



ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, ఏజెన్సీల తప్పిదంతో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి వేతనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి

-ఆంజనేయులు, మోడల్ స్కూల్ పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

అప్పులు చేయాల్సిన పరిస్థితి



మూడు నెలలుగా మాకు వేతనాలు అందలేదు. ప్రభుత్వం 1వ తేదీన జీతాలు ఇస్తుందని ఆశించాం. కానీ.. ఇంత వరకు అందకపోవడంతో ఇంటి అవసరాలకు సైతం అప్పులు చేయాలల్సిన పరిస్థితి. ఉపాధ్యాయుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే జీతాలు చెల్లించాలి.

- అశోక్ హిందీ టీచర్, శంకర్‌పల్లి స్కూల్

ఒకటో తేదీనే వేతనాలివ్వాలి



ఇప్పటికైనా వెంటనే జీతాలు ఇవ్వాలి. నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్నాం. ఇంటి అవసరాలకు బయట అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇచ్చే చాలీచాలని జీతాన్ని కనీసం ప్రతి నెలా ఒకటో తేదీన ఇవ్వాలి. వార్డన్లకు జీతాలు పెంచాలి. సీఎం స్పందించి త్వరగా జీతాలు ఇవ్వాలి.

- విజయలక్ష్మి, వార్డన్/కేర్ టేకర్, చేవెళ్ల స్కూల్

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి



మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, ఆగస్టు 10 : నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం వికారాబాద్ 14, 23 వార్డుల్లోని పార్కుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ మనుగడకు మొక్కలే ఆధారమని, సకాలంలో వర్షాలు కురిసేందుకు వృక్షాలు దోహదం చేస్తాయన్నారు. పట్టణాల్లో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని కమిషనర్ జకీర్ అహ్మద్‌ను ఆదేశించారు. పార్కుల్లో యోగా బెడ్స్‌ను, పిల్లలు ఆడుకునేందుకు వివిధ పరికరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. వార్డులన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. 23వ వార్డులో చిన్నారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. 'పార్క్‌లో మీకు ఎలాంటి ఆట వస్తువులు కావాలి? అని అడిగారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రామస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు

మాదిరెడ్డిపల్లి, ఆర్కతలలో మట్టి తరలింపు ● పట్టించుకోని అధికారులు



మాదిరెడ్డిపల్లిలో ప్రభుత్వ భూమిలో చేపడుతున్న మట్టి తవ్వకాలు

నవాబుపేట, ఆగస్టు 10: నవాబుపేట మండలంలోని మాదిరెడ్డిపల్లి, ఆర్కతల తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రైవేట్ వెంచర్ల నిర్వాహకులు టిప్పర్లకొద్దీ మట్టిని తరలిస్తూ స్థలాల నామరూపాల్లేకుండా చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వకాలపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సర్వే నంబర్49లో ఇళ్లకు ఆనుకొని ఉన్న ఎత్తైన ప్రదేశంలో తవ్వకాలు చేపడుతున్నారని తెలిపారు. మట్టి తవ్వకాలతో భారీగా గుంతలు ఏర్పడి ఇళ్లకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ జయరాం స్పందన కోరగా గ్రామంలో మట్టి తవ్వకాలకు అనుమతుల్లేవని తెలిపారు.

ఐటీఐల్లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సులు



మేడ్చల్ ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఏటీసీ భవనం

- మేడ్చల్, శామీర్‌పేట, అల్వాల్ ఐటీఐ కాలేజీల్లో ఏర్పాటు
- అందుబాటులోకి ఆధునిక కోర్సులు
- కొనసాగుతున్న భవనాల నిర్మాణం
- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం

మేడ్చల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గల మూడు ఐటీఐ కాలేజీల్లో టాటా కంపెనీ సౌజన్యంతో అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు ఆయా ఐటీఐల ప్రాంగణాల్లో ఇప్పటికే భవనాల నిర్మాణాలను ప్రారంభించారు. ఐటీఐ కోర్సులపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఇది ఎంతగానో మేలు చేస్తుంది. అలాగే ఆధునిక సాంకేతిక కోర్సులు నేర్చుకునే అవకాశం లభిస్తుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు(ఎ.టి.సి)ల ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేరున్న టాటాకంపెనీ ఈ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ఇందుకు ప్రభుత్వం టాటా కంపెనీతో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి సెంటర్ల ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏటీసీలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో మేడ్చల్, శామీర్‌పేట, అల్వాల్ ఐటీఐల్లో ఏటీసీలను ఏర్పాటు చేస్తారు. ఈ ఐటీఐ ప్రాంగణాల్లో ఏటీసీల ఏర్పాటుకు స్థలాన్ని కూడా కేటాయించడంతో భవనాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే నూతన భవనాల్లో కొత్త కోర్సులను నిర్వహిస్తారు.

ఆరు కొత్త కోర్సులు

ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుతో విద్యార్థులకు కొత్తగా ఆరు అడ్వాన్స్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్యూఫాక్చరింగ్, ఆర్టీసన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్(మెకానికల్), అడ్వాన్స్ సి.ఎన్.సి మ్యాచింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రిక్ వెహికల్ మెకానిక్, మ్యాన్యూఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులు ఉన్నాయి. ఈ అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులకు ఫ్యాకల్టీ, టూల్స్, మెషనరీ అన్నీ టాటా కంపెనీయే సమకూర్చనుంది. ట్రేడ్‌కు ఒక మాస్టర్ చొప్పున ఆరు ట్రేడ్లకు ఆరుగురు ట్రైనింగ్ మాస్టర్లను నియమిస్తారు. శిక్షణకు అవసరమైన యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక అవసరాలు అన్ని టాటా కంపెనీ సరఫరా చేస్తుంది.

ఒక్కో ఏటీసీకి రూ.4.77కోట్లు కేటాయింపు

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటులో భాగంగా టాటా కంపెనీ ఒక్కో సెంటర్‌కు రూ.4.77కోట్లు కేటాయించనుంది. జిల్లాలో మూడు సెంటర్లకు కలిపి రూ.14.31 కోట్ల వ్యయం చేయనుంది. రెండేళ్ల పాటు టాటా కంపెనీ ఏటీసీ భవనాల నిర్వహణ చేపట్టనుంది. మెషినరీ టూల్స్ ఫ్యాకల్టీ సమకూర్చడం చూసుకుంటుంది. రెండేళ్ల తర్వాత వీటి నిర్వహణను ప్రభుత్వమే చేపట్టనుంది.

ఏటా 488 మంది విద్యార్థులకు శిక్షణ

శాస్త్రసాంకేతిక రంగంలో రోజురోజుకూ ఎన్నోమార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉన్న అభ్యర్థులకే కంపెనీలు ఉద్యోగాలు ఇస్తున్నాయి. యువతకు సాంకేతిక నైపుణ్యాన్ని నేర్పి నిరుద్యోగ సమస్యను తీర్చేందుకే టాటా కంపెనీ సహకారంతో ప్రభుత్వం ఈ అడ్వాన్స్ కోర్సులను ప్రవేశపెడుతోంది. ఇప్పటి వరకు ఐటీఐలలో సాధారణ శిక్షణ మాత్రమే అందిస్తున్నారు. పెరిగిన పారిశ్రామికీకరణ, ఉత్పత్తి సంస్థలతో దేశంలో ఐటీఐలలో శిక్షణ పొందిన వారికి మంచి డిమాండ్ ఉంది. పరిస్థితులకు అనుగుణంగా శిక్షకులను తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఆధునిక పరిజ్ఞానంతో కూడిన రోబోటిక్స్, డిజిటల్, ఎలక్ట్రిక్, ఆటోమేషన్ రంగాల్లో శిక్షణ ఇచ్చి తమ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం, టాటా కంపెనీ ఏటీసీలను ఏర్పాటుచేస్తున్నాయి. ఈ కోర్సుల్లో మేడ్చల్ జిల్లాలో ఏటా 488 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

నల్సార్‌లో 'ఏఐ'పై న్యాయ సదస్సు

- పాల్గొన్న లా కమిషన్ ఆఫ్ ఇండియా మెంబర్, సెక్రటరీ రీటావశిష్ట్

-7లో

గోదారంగనాయక స్వామికి
ఘనంగా చక్రతీర్థం

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 10 : ఎదులాబాద్‌లోని శ్రీ గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం చక్రతీర్థం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిత్యవిధి, మహా పూర్ణాహుతి, దేవతోద్వాసన, ద్వాదశారాధన, పుష్పయాగం కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం గాంధోళి ఉత్సవం, చక్రతీర్థ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ అవరణలో స్వామివారలకు పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు పల్లకి మోస్తున్న సమయంలో స్వామివారిపై భక్తులు పూలు చల్లారు. భారీ సంఖ్యలో స్వామివారి సేవలో తరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, శేషాచార్యులు, రాజగోలపాచార్యులు, పురుషోత్తమాచార్యులు, సేనమాచార్యులు, పవనాచారి, అచ్యుతచారి, శ్రీవాస్తవ, ఆదిత్యాచార్యులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లో రంగనాయకస్వామి వారి చక్రతీర్థం సందర్భంగా నిర్వహిస్తున్న పల్లకీ సేవ

తాండూరు బంద్ సంపూర్ణం

తాండూరు, ఆగస్టు 10: బంగ్లాదేశ్‌లో హిందువులపై కొనసాగుతున్న దాడులకు నిరసనగా శనివారం తాండూరు బంద్‌ను నిర్వహించారు. తాండూరు ఐక్యవేదిక పిలుపు మేరకు వ్యాపార, వాణిజ్య సముదాయాలతో పాటు చిన్న, చిన్న దుకాణాలు, హోటల్స్‌ను స్వచ్ఛందంగా మూసివేసి సంఘీభావం తెలిపారు. పట్టణంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో హిందువులు, వ్యాపారులు కదిలివచ్చి భారీ నిరసన ర్యాలీని నిర్వహించారు. నెహ్రూ గంజ్ ఎల్లమ్మ ఆలయం నుంచి శాంతియుత నిరసన ర్యాలీని పురవీధుల్లో నిర్వహించి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. సేవ్ హిందుస్తాన్ ఇన్ బంగ్లాదేశ్ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ హిందు బంధువులు కదం తొక్కారు. ర్యాలీ అనంతరం ఇందిరాచౌక్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖాపురం అంజనేయులు, యు.రమేష్‌కుమార్, రజనీకాంత్, నాగారం మల్లేశం, మంకాల రాఘవేందర్, సుదర్శన్‌గౌడ్, బంటారం భద్రేశ్వర్, తర్లపల్లి భానుకుమార్, పర్యాద రామకృష్ణ, అంతారం కిరణ్, బంటారం భద్రేశ్వర్, అలంపల్లి శ్రీనివాస్, వ్యాపార, వాణిజ్య ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



తాండూరులో భారీ నిరసన ర్యాలీ

పామిడోస్ గేటెడ్ కమ్యూనిటీలో

చెట్ల నరికివేత

మేడ్చల్ టౌన్, ఆగస్టు 10: ఒకవైపు స్వచ్ఛదనం-పచ్చదనం అంటూ ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టగా మరో వైపు కొందరు తమ ఇళ్ల ముందు చల్లని నీడనిచ్చే పచ్చని చెట్లను నరికేస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సంపన్నుల కాలనీగా చెప్పుకునే పామిడోస్ విల్లాస్‌లో కొందరు గుట్టుచప్పుడు కాకుండా తమ ఇళ్ల ముందు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పచ్చటి చెట్లను శనివారం తొలగించారు. సుమారు 15 సంవత్సరాల కిందట ఇళ్ల ముందు నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా పెరిగాయి. వాటిని తొలగించటం పట్ల కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఈ విల్లావాసులు క్రమశిక్షణలో ఇతర గేటెడ్ కమ్యూనిటీ వాసులకు ఆదర్శంగా ఉంటారు. అలాంటిది పచ్చని చెట్లను తొలగించటం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. చెట్ల నరికివేత విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డుకోవడానికి మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డులు మున్సిపల్ సిబ్బందిని లోపలికి అనుమతించలేదు. అనంతరం ఎలాగోలా వీల్లాలోపలికి ప్రవేశించి చూడగా అప్పటికే 15-20 చెట్లను నరికేశారు. చెట్లనుంచి కొమ్మలు వేరు చేసి పెద్ద పాటి భాగాలను తరలించడానికి సిద్ధం చేసి ఉంచారు. ఈ గేటెడ్ కమ్యూనిటీలో దాదాపు 200కు పైగా ఇళ్లు ఉన్నాయి. కాలనీ లోపలికి ఇతరులకు ప్రవేశం పూర్తిగా నిషేదించారు. ఎవరైనా లోపలికి ప్రవేశించాలనుకుంటే ముందుగా కాలనీవాసుల అనుమతి పొంది లోపలికి రావాలి. ఇక చెత్త సేకరించడానికి వచ్చే మున్సిపల్ సిబ్బంది కూడా గేటెడ్ కమ్యూనిటీ వారు నిర్ధారించిన సమయానికి లోపల ప్రవేశించి చెత్తసేకరించుకుని బయటకు రావాలి. ఇలాంటి పరిస్థితుల్లో లోపల ఏంజరుగుతుందో బయటి ప్రపంచానికి తెలియని పరిస్థితి. మున్సిపల్ సిబ్బంది చెట్ల నరికివేత గురించి ఆరాతీయగా సమాధానం చెప్పేవారు లేకపోవటంతో వారు ఫొటోలను తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. అయినప్పటికీ రెండవ శనివారం కావటంతో మున్సిపల్ కార్యాలయానికి సెలవు ఉండి స్పందించే నాథుడు కరువయ్యారు. కాగా పెద్ద చెట్లు ఇబ్బందికరంగా మారటంతో వాటిని తొలగించి వాటిస్థానంలో చిన్నపాటి అలంకరణ మొక్కలు నాటుకోవడానికి కొందరు చెట్లను నరికించినట్లు తెలిసింది.

నా దృష్టికి రాలేదు

పామిడోస్ గేటెడ్ కమ్యూనిటీలో చెట్ల తొలగింపు విషయం నా దృష్టికి రాలేదు. రెండవ శనివారం కావటంతో మున్సిపల్ కార్యాలయానికి సెలవు ఉండటంతో అదను చూసి చెట్ల నరికివేత చేపట్టినట్లు తెలుస్తోంది. చెట్లు నరకడం చట్టపరంగా నేరం. ఒక వేళ అనుమతి లేకుండా చెట్లు నరికితే విచారణ జరుపుతాం.

- స్వామి, మున్సిపల్ కమిషనర్



పామిడోస్ గేటెడ్ కమ్యూనిటీలో నరికేసిన చెట్లు



రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బాదాం శ్రీనివాస్

పరిగి, ఆగస్టు 10: పరిగి పట్టణానికి చెందిన బాదాం శ్రీనివాస్ రైస్ మిల్లర్స్ అసోసియేసన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు.

కొత్త రుణాలు మంజూరులో జాప్యం

కులకచర్ల, ఆగస్టు 10: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదనే చందంగా ఉంది బ్యాంకు అధికారుల పని తీరు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణాలను ఇప్పటి వరకు రెండు విడతలుగా రూ.1.50 లక్షలలోపు వారికి మాఫీ చేసింది. కాగా బ్యాంకు అధికారులు రుణమాఫీ అయిన రైతులకు తిరిగి వెంటనే రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ రైతులకు నూతన రుణాలు అందించడంలో బ్యాంకు అధికారులు తీవ్ర జాప్యం వహిస్తున్నారు. నూతన రుణాలు ఇచ్చేందుకు రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కులకచర్ల ఉమ్మడి మండల వ్యాప్తంగా కులకచర్ల, ముజాహిద్‌పూర్, చౌడాపూర్‌లలో తెలంగాణ గ్రామీణ బ్యాంకులు, కులకచర్ల, మరికల్‌లో ఎస్‌బీలు, కులకచర్లలో సహకార బ్యాంకులు ఉన్నాయి. వీటి ద్వారా దాదాపు 10వేలకుపైగా రైతులు రుణాలు పొందారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.1లక్ష లోపు రుణాలు 2003 మందికి మాఫీ అయ్యాయి. రెండు విడతలుగా రూ.45.04కోట్లు మాఫీ జరిగింది. రుణ మాఫీ రాలేదని ఇప్పటి వరకు 500మంది రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదేంటని పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తే అతిత్వరలో రుణాలు అందిస్తామని బ్యాంకు అధకారులు చెబుతున్నారు. రుణాలు ఇవ్వకపోవడంతో పంటలసాగుకు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అప్పు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని నూతన రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కూల్చేశారు.. కంచె వేయడం మరిచారు

తాత్కాలిక చర్యలతో సరిపెట్టుకున్న రెవెన్యూ అధికారులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 9: ప్రభుత్వ స్థలాలను రక్షించడానికి ఒక వైపు రాష్ట్రప్రభుత్వం కొత్త చట్టాలను అమల్లోకి తీసుకొస్తుండగా మరో వైపు అధికారుల ఉదాసీనత కారణంగా కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసే ప్రయత్నంలో ఉన్నారు.నగర శివారు ప్రాంతంలోని మేడ్చల్ పట్టణంలో గజం జాగ కొనడం గగనంగా మారిన పరిస్థితుల్లో రియల్టర్లకు చట్టాలు చుట్టాలుగా మారాయనే విధంగా కొన్ని ఘటనలు నిరూపిస్తున్నాయి. ఇటీవల మేడ్చల్ పట్టణంలో ఓ వెంచర్ కోసం రియల్టర్లు ప్రభుత్వ స్థలంలో వేసిన సీసీరోడ్డు ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. సమయానికి కలెక్టర్ స్పందించకపోతే రియల్టర్లు ప్రభుత్వస్థలం లోపలి నుంచి దర్జాగా రోడ్డు వేసుకునేవారు. ఈ ఘటనతో స్థానికంగా చర్చనీయాంశమైంది. అధికారులు ప్రభుత్వ స్థలంలో నిర్మించిన సీసీరోడ్డును తొలగించినప్పటికీ కంచె వేసి స్థలం రక్షణకు చర్యలు చేపట్టక పోవటంతో అధికారుల తీరుపట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్వేనెంబర్ 145లోని రెండెకరాల 18గుంటల స్థలానికి అధికారులు కంచె ఏర్పాటుచేసి రక్షణ కల్పించాలంటూ



లేఅవుట్ మ్యాప్‌లో వెంచర్ ముందు చూపెడుతున్న ప్రభుత్వ స్థలం

స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమిని అలాగే వదిలేస్తే రియల్టర్లు మళ్లీ కబ్జా చేసే అవకాశాలున్నాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 70-80 అడుగుల పొడవున మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డుకు, ప్రైవేట్ వెంచర్‌కు అనుకుని మధ్యన ఉన్న రెండెకరాల 18గుంటల ప్రభుత్వ స్థలంలో 14గుంటలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కేటాయించారు. కాగా అగ్నిమాపక దళం వారు స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకోకుండా వదిలేశారు. దీంతో రోడ్డుకు వెంచర్‌కు మధ్య ఈ ప్రభుత్వ భూమి పడావు భూమిగా మారి చివరికి రియల్టర్లు వెంచర్ కోసం రోడ్డు వేసేవరకూ వెళ్లింది.

రెండు వెంచర్లకు దారేది?

సర్వేనెంబర్ 145లోని 2.18గుంటల ప్రభుత్వ స్థలానికి అనుకుని ఉన్న సర్వేనెంబర్ 139, 143, 144లో రెండెకరాల 39 గుంటల్లో దాదాపు 42 పాట్లతో పంచాయతీ ద్వారా 2006లో అనుమతి పొందిన లేఅవుట్‌ను తయారుచేసి ప్లాట్లుగా విక్రయించారు. 2023లో ఇదే (పంచాయతీ లేఅవుట్) రోడ్లను లింక్ చేస్తూ సర్వేనెంబర్ 138, 140, 141లో దాదాపు 33 ప్లాట్లతో మరో హెచ్ఎండీఏ వెంచర్‌ను తయారు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రెండు వెంచర్లకు అప్రోచింగ్ రోడ్డు ఎక్కడి నుంచి ఉన్నదనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ఈ రెండు వెంచర్లకు అప్రోచింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ స్థలం నుంచి కొంతవరకు స్థలాన్ని కొలాలి. లేదంటే చుట్టు పక్కన ఉన్న ప్రైవేట్ స్థలాలను కొని రోడ్డును ఏర్పాటు చేసుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో వెంచర్లకు రియల్టర్లు అప్రోచింగ్ రోడ్డును ఎలా సమకూర్చి ఇస్తారన్నదే చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి



ప్రజలకోసం ఉపయోగపడే ప్రభుత్వస్థలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రభుత్వ స్థలాలను రక్షణ లేకుండా వదిలేస్తే ప్రైవేటు వ్యక్తులు వాటిని కబ్జాచేసి రోడ్లు వేస్తున్నారు. చివరికి నిర్మాణాలు చేపడుతారు. సర్వేచేయించి సర్వే నెంబర్ 2.39గుంటల స్థలాన్ని సర్వేచేసి కంచె ఏర్పాటు చేయాలి. - జంగ హరికృష్ణ, కౌన్సిలర్

అధికారుల ఉదాసీనతకు నిదర్శనం



ప్రజలకు అవసరమయ్యే ప్రభుత్వ భూములను కబ్జాచేసి దర్జాగా రోడ్లు ఏర్పాటు చేసే పరిస్థితి దాపరించడం అధికారుల ఉదాసీనతక నిదర్శనం. క లెక్టర్‌కు ఫిర్యాదు చేసేంత వరకు స్థాని క అధికారులు పట్టించుకోకపోవడం వారి పనితీరు పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసీ రోడ్డును తొలగించడం కాదు. వెంటనే కంచె ఏర్పాటు చేసిప్రభుత్వ స్థలంగా బోర్డు ఏర్పాటు చేయాలి. - జాకట ప్రేమ్ దాస్, బీజేపీ మేడ్చల్ పట్టణ ప్రధాన కార్యదర్శి

అంగుళం జాగనూ వదలం



ప్రభుత్వ స్థలం నుంచి అంగుళం జాగ కూడా వదలి పెట్టం. ప్రభుత్వ స్థలాలను కాపాడే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. రోడ్డు వేసిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయి. రియల్టర్లు వేసిన రోడ్డును తొలగించాం. సమగ్రంగా సర్వే నిర్వహించి సర్వే నెంబర్ 145లోని ప్రభుత్వ స్థలానికి కంచె ఏర్పాటు చేస్తాం. ఒక వేళ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేసిన, పాట్ల హద్దులు ఏర్పాటు చేసినా వాటిని తొలగించి సదరు వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. - శైలజ, తహసీల్దార్, మేడ్చల్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

రాష్ట్రంలో అరాచక పాలన

బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

కేశంపేట, ఆగస్టు 10: రాష్ట్రంలో అరాచక పాలన కొన సాగుతోందని బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం రాజేంద్ర నగర్ పరిధిలోని శివరాంపల్లి చెరువులో అక్రమ నిర్మాణాలను హైడ్రా ఆధ్వర్యంలో తొలగించే కార్యక్రమం చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముబీన్ పనులను అడ్డుకునేందుకు అక్కడి వెళ్లారు. దాంతో ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఉదయం 10.30 గంటలకు కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకవచ్చారు. సాయంత్రం 4.30 గంటలకు శంషాబాద్‌కు తరలించే క్రమంలో మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, తెలంగాణలో యోగీ ఆదిత్యనాథ్ తరహా ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నడిపిస్తోందన్నారు. చెరువుల్లో ఇళ్లు కట్టుకుంటున్నప్పుడు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎక్కడిపోయారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలం అయితే నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను ఎలా కూల్చివేస్తారని అన్నారు. కాగా, ఎమ్మెల్యేను కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకవచ్చారని తెలిసి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినొద్దీన్ తన అనుచరులతో కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆయనతో మాట్లాడారు. అనంతరం ఆయన్ను బందోబస్తు మధ్య శంషాబాద్‌కు తరలించినట్లు కేశంపేట పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సినారె సాహిత్య పురస్కారం ప్రదానం

పెద్దేముల్, ఆగస్టు 10: ఉపాధ్యాయుడు ద్యావరి నరేందర్‌రెడ్డికి సినారే సాహిత్య పురస్కారం లభించింది. మండల కేంద్రానికి చెందిన ద్యావరి నరేందర్‌రెడ్డి పెద్దేముల్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆంగ్ల బోధన చేస్తున్నారు. అయితే ఆయన కవిత్వమంతా తెలుగులోనే ఉంటుంది. తెలుగులో ఆయన గజల్స్ రాస్తుంటారు. తెలుగు సినిమాలో పాటలూ రాశారు. అయితే ఆయన తెలుగు సాహిత్యంలోని గజల్ ప్రక్రియలో రెండు దశాబ్దాల నుంచి విశేష కృషి చేస్తున్నందున ఆయనను సినారే సాహిత్య పురస్కారం 2024 వరించింది. హైదరాబాద్‌కు చెందిన మహాకవి సినారె కళాపీఠం సంస్థ డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జన్మదినం సందర్భంగా సాహిత్య పురస్కారాలను అందజేశారు. హైదరాబాద్‌లోని తుర్కయాంజల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిధారెడ్డి చేతులమీదుగా ద్యావరి నరేందర్‌రెడ్డికి ఈఅవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాకవి సినారె కళాపీఠం అధ్యక్షుడు మల్లెకేడి రాములు, తేజసాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి, తుర్కయాంజల్ మున్సిపల్ కౌన్సిలర్ సునీల్, రెండు తెలుగురాష్ట్రాల ప్రముఖ కవులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు. ద్యావరినరేందర్ రెడ్డి సినారే సాహిత్య పురస్కారం అందుకోవడం పట్ల తాండూరు కళాభారతి సాహిత్య వేదిక అధ్యక్షుడు రామకృష్ణరాజు, ప్రధానకార్యదర్శి బాకారాం జయపాల్‌రెడ్డి, కవులు సిద్దిలింగయ్య, కోటం చంద్రశేఖర్, గాజుల పవన్‌కుమార్, పెరుమాళ్ల వెంకటరెడ్డి, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు సునీత, తోటి ఉపాధ్యాయులు, వికారాబాద్ జిల్లా గెజిటెడ్ లెక్చరర్స్ సంఘం అధ్యక్షుడు టి.మహేందర్‌లు హర్షం వ్యక్తం చేశారు.



సినారె సాహిత్య పురస్కారం అందుకుంటున్న ద్యావరి నరేందర్‌రెడ్డి

నల్సార్‌లో ఏఐపై న్యాయ సదస్సు

మూడుచింతలపల్లి, ఆగస్టు 10: నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా సహకారంతో 'కృత్రిమ మేథస్సు-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-చట్టం, న్యాయం' అనే అంశాలపై శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో గల నల్సార్ యూనివర్సిటీలో ఒక రోజు సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో నల్సార్ యూనివర్సిటీ, లా కమిషన్ ఆఫ్ ఇండియా సహకారంతో సదస్సు కొనసాగింది. లా కమిషన్ ఆఫ్ ఇండియా మెంబర్-సెక్రెటరీ రీటా వశిష్ట్, ఇతర వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అభివృద్ధి చెందుతున్న శాస్త్ర,సాంకేతిక పరిణామాలతో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చట్టానికి, న్యాయ వ్యవస్థకు మధ్య ఎలాంటి సంబంధం ఉండాలి?' అనే అంశాలపై చర్చించారు. ప్రభుత్వ విభాగాలు, విద్యా సంస్థలు న్యాయ సాంకేతిక, పారిశ్రామిక రంగ నిపుణులు సమావేశంలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశ న్యాయ వ్యవస్థలో వ్యాజ్యాలను తీర్చేందుకు, ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు ఇప్పటికే 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' సాంకేతికతను వాడుకుంటోందని వక్తలన్నారు. సుప్రీం కోర్టు ఏఐ సదుపాయం కల్పించిన న్యాయస్థానాల పని సామర్థ్యాన్ని పెంచేందుకు ఆధునీకరణ ఫేజ్-3లో ఏఐ ఆధారిత సాధనాలను అనుసంధానం చేసింది. ఈ సందర్భంగా నల్సార్ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ.. ఈ సమావేశం రెండు సెషన్లు జరిగిందన్నారు. కార్యక్రమంలో నాస్‌కామ్ మాజీ డైరెక్టర్ బీవీఆర్.మోహన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగ ఎమర్జింగ్ టెక్నాలజీ డైరెక్టర్ రమాదేవి, న్యాయ వ్యవస్థ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వక్త



తలకొండపల్లి-మిడ్జిల్ రహదారిపై నిరసన చేస్తున్న బీజేపీ నాయకులు

రోడ్డు పనులు పూర్తి చేయాలి

తలకొండపల్లి, ఆగస్టు 10: తలకొండపల్లి-మిడ్జిల్ ప్రధాన రహదారిపై బ్రిడ్జిల వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు వెంటనే పూర్తిచేసి రాకపోకలకు ఇబ్బందులు తీర్చాలని కోరుతూ శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పనుల నిర్వహణ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రధాన రహదారిపై కొద్దిసేపు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పద్మ అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు చేపట్టి పదేళ్లు కావోస్తున్నా నేటికీ అసంపూర్తిగానే నిలిచిపోయాయని తెలిపారు. అసంపూర్తి పనులను పూర్తి చేయాలని అనేకమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని అనిల్ ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన రోడ్డు మూలంగా వాహనదారులు అనేక మంది ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు. అసంపూర్తి పనులు వెంటనే చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో పోరాట కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌గౌడ్, గణేశ్, మహేశ్, మనోహర్, శ్రీశైలం, శంకర్, రవి, చందు, మల్లేశ్, రంగయ్య, రాజు, మధు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దు

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు



పోలీసులకు సూచనలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 10: శాంతిభద్రతల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడకూడదని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులతో సీపీ మాట్లాడుతూ బాధితులెవరైనా స్టేషన్‌కు వస్తే సమస్యలేంటనేది తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. మహిళల భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రిసెప్షన్ మొదలు పెట్రోలింగ్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన ఎవరికివారు విధుల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ అంటే ప్రజలతో మమేకవడమేనని ఆయన అన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రోడ్డుపై వాహనాలు నిలిపితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏసీపీ కేవీపీ రాజు, సీఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



నడిరోడ్డుపై మురుగు

మొయినాబాద్, ఆగస్టు 10: చిన్నపాటి వర్షం కురిస్తేచాలు హిమాయత్ నగర్ కుమ్మరి బస్తీ ప్రధాన రోడ్డుపై వర్షపు నీటితో పాటు అండర్ డ్రైనేజీ మురుగు పరుగు తీస్తోంది. దాంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. చిలుకూరు బాలాజీ ఆలయానికి వెళ్లే భక్తులు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. చిన్నపాటి వానపడితే డ్రైనేజీ నీరు రోడ్డుపై పరుగులు తీస్తోంది. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు పంచాయతీ అధికారులను కోరుతున్నారు. అంతేకాకుండా చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పేదల భూ సమస్యలు పరిష్కరించాలి


జిల్లా సదస్సు కరపత్రం విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, రైతులు

బొంరాస్‌పేట్, ఆగస్టు 10: నియోజకవర్గంలోని దుద్యాల్ మండలంలో అభివృద్ధి పేరుతో రైతులు, పేదల భూములు లాక్కోవడాన్ని వెంటనే ఆపాలని, ధరణి పోర్టల్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, పేదల భూసమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13న కొడంగల్‌లోని రెడ్డిబసిరెడ్డి గార్డెన్‌లో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హకీంపేట గ్రామ భూబాధితులతో భూసదస్సు కరపత్రం విడుదల చేశారు. ఫార్మా కంపెనీ పేరుతో హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల, పులిచర్ల తండా, రోటిబండ తండాల్లో భూములు తీసుకోవడం సరైంది కాదని, ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, మల్లేశ్, నర్సిములు, బసప్ప, మణికంఠగౌడ్, నారాయణ, వెంకటయ్య, శివకుమార్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ, బీటీరోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం


సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 10: మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో గల కాలనీల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి శివాజీనగర్‌లో శనివారం రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుంచేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా సీసీ, బీటీరోడ్ల నిర్మాణంతోపాటు డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లను ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. పోచారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అబివృద్ధిలో ముందుంచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్‌రెడ్డియా నాయక్, కౌన్సిలర్ సుర్వీ రవీందర్‌గౌడ్, కోఆప్షన్‌సభ్యుడు అక్రం అలీ, ఏఈ మహిపాల్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ జాతీయ జెండా అందజేత


జాతీయ జెండాను పంపిణీ చేస్తున్న నల్లా వెంకట్‌రెడ్డి

కీసర, ఆగస్టు 10: మండల కేంద్రం కీసరలో బీజేపీ నాయకుడు నల్లా వెంకట్‌రెడ్డి శనివారం ఇంటింటికీ జాతీయ జెండాను పంపిణీ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' అనే కార్యక్రమంలో భాగంగా ప్రతీ పౌరుడికి దేశభక్తి పెంపొందించేందుకు ఇంటింటికీ జాతీయ జెండాను అందజేస్తున్నట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ప్రతీ ఒక్కరు తమ డీపీని జాతీయ జెండాను పెట్టుకోవాలని నల్లా వెంకట్‌రెడ్డి ప్రచారం చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మర్పల్లి, ఆగస్టు 10: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 21ఏళ్ల తర్వాత పూర్వవిద్యార్థులు శనివారం ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారు కలిసి చదువుకున్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 21ఏళ్ల తర్వాత ఒకే దగ్గర కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను మర్చిపోకుండా వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లయ్య, కృష్ణారెడ్డి, ఆనందం, భాస్కర్, రాజ, ప్రసన్న, సుజాత, భవానీ, నాగేశ్, వెంకట్రామ్, రాఘవేందర్, తుల్జారామ్, లింగంగౌడ్, నర్సింహులు, సునీల్, కార్తీక్, జోత్స్న, సంధ్య, లత, వీరమణి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం


వికారాబాద్: హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళలు


కొడంగల్: సిద్ధనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వికారాబాద్ ఆగస్టు 10: శ్రావణ శనివారం పురస్కరించుకొని వికారాబాద్ పట్టణంలోని గంగారంలో పెద్దఎత్తున మహిళా సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో గంగారం గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ పట్టణ శివారులోని యాద్గీర్ రోడ్డులో గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 46వ శనివారం పూర్తయిన సందర్భంగా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆలయ గర్భగుడి నిర్మాణానికి కడప పూజ

తాండూరు రూరల్: మండలంలోని అంతారం గ్రామంలోని పురాతన ఆంజనేయస్వామి ఆలయ గర్భగుడి నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి గ్రామ ప్రజలు, భక్తులు, యువకులు పెద్దలు, పార్టీలకతీతంగా ముందుకు వచ్చిన దాతల సాయంతో పనులు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా గర్భగుడి నిర్మాణానికి వేద పండితులు వెంకటచార్ శుక్రవార్ ఆధ్వర్యంలో కడప పూజ, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పుల్ల వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శాంతు, మాజీ ఎస్‌ఎంఎస్ చైర్మన్ వడ్డె కృష్ణ, ఆలయ కమిటీ సభ్యుడు పుల్ల ప్రభాకర్‌రెడ్డి, సల్ల సంపత్ కుమార్, మాజీ వార్డు సభ్యుడు ఎల్.రాజేందర్‌రెడ్డి, కాసుల నారాయణ, పెద్ద కురువ బీరప్ప, కురువ శ్రీనివాస్, కేసి కోటప్ప, రవి, శేరి విజేందర్‌రెడ్డి, ఎస్.రాజు పటేల్, బలరాం, ఉప్పరి నర్సింహులు, మేస్త్రీ అంజయ్య, పుల్ల సుబ్బారెడ్డి, ప్యాట బాలప్ప, బోరం అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


తాండూరు రూరల్: అంతారంలో ఆంజనేయస్వామి గర్భగుడి నిర్మాణానికి పూజ చేస్తున్న పండితులు

వైభవంగా పెద్దమ్మతల్లి బోనాలు

మూడుచింతలపల్లి, ఆగస్టు 10 : మూడుచింతలపల్లి మండలంలోని అద్రాస్‌పల్లి గ్రామంలో శనివారం పెద్దమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకొని మహిళలు ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్లారు. వర్షాలు బాగా కురువాలని పంటలు బాగా పండాలని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ మొక్కులను చెల్లించుకున్నారు.


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

పేదలకు సీఎంఆర్‌ఎఫ్‌తో ఆపన్నహస్తం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 10: పేదలకు సీఎంఆర్‌ఎఫ్‌తో ఆపన్నహస్తం అందిస్తున్నట్లు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేసుకునే నిరుపేదలు సీఎంఆర్‌ఎఫ్ కింద సాయం పొందాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సాయం అందేలా చూస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు పేదలకు సాయమందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, బీఆర్‌ఎస్ మేడ్చల్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర రూరల్: గుండె సంబంధిత వ్యాధికి గురై కోలుకున్న నాగారం మున్సిపాలిటీ ఎస్వీనగర్‌కు చెందిన శివకుమార్‌కు శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.38,500ల చెక్కును ఆయన నివాసంలో అందజేసారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీకి చెందిన టీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు గూడూరు ఆంజనేయులు గౌడ్, స్థానికుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు

బషీరాబాద్, ఆగస్టు 10: అసలే వర్షాకాలం.. వరుసగా కురుస్తున్న వర్షాలతో ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బస్సు షెల్టర్లు లేక చెట్ల కింద, హోటళ్లు, రోడ్లపై నిలబడి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. బషీరాబాద్‌లో 30ఏళ్ల కిందట నిర్మించిన బస్టాండ్ నిరుపయోగమై దర్శనమిస్తోంది. బస్సుల రాకపోకలకు అనుకూలంగా లేకపోవడంతో నాటి నుంచి ప్రయాణికులకు ఉపయోగపడక శిథిలావస్థలో మగ్గుతోంది. స్థానిక రైల్వేస్టేషన్ కూడలిలోని చెట్టు కింద విద్యార్థులు, ప్రయాణికులు నిలబడి బస్సులు ఎక్కి వెళ్తున్నారు. గ్రామాల్లో అక్కడక్కడా బస్సుషెల్టర్లు ఉన్నా వాడుకలో లేవు. దీంతో విద్యార్థులు ప్రమాదపు అంచున రోడ్లపై బస్సుల కోసం వేచి చూస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు హోటళ్ల వద్ద రోడ్లపై గంటల తరబడి నిరీక్షించాల్సివస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సు షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


బషీరాబాద్‌లో 30 ఏళ్లుగా నిరుపయోగంగా మారిన బస్టాండ్


మైల్వార్‌లో ప్రధాన రోడ్డుపై నిలబడి బస్సెక్కుతున్న ప్రయాణికులు

కాలిఫోర్నియా యూనివర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే


కాలిఫోర్నియాలో సీఎంరేవంత్‌రెడ్డితో కలిసి సమావేశమైన ఎమ్మెల్యే

పరిగి, ఆగస్టు 10: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కాలిఫోర్నియాలోని ప్రఖ్యాత స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించి, అక్కడి స్టాన్‌ఫోర్డ్ బయర్స్ సెంటర్ ఫర్ బయోడిజైన్ విభాగం అధిపతులతో సమావేశమయ్యారు. తెలంగాణ హెల్త్‌కేర్ ఇన్నోవేషన్, స్కిల్ డెవలప్‌మెంట్, లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ తదితర అంశాల్లో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్యంపై సీఎం బృందం చర్చలు జరిపారు. సీఎంతో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థపై అవగాహన ఉండాలి


డీపీసీఎస్ విద్యార్థులతో సీఐ సైదులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 10: పోలీస్ వ్యవస్థపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీఐ సైదులు అన్నారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌ను స్థానిక ఢిల్లీ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. పోలీసుస్టేషన్‌లోని ఆయుధాల గదిని, లాకప్, విచారణ గదిని చూశారు. ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ.. అపరిచితుల వెంట వెళ్లొద్దని చిన్నారులకు సూచించారు. తల్లిదండ్రులు, బంధువులు వస్తేనే వారితో వెళ్లాలని, తెలియనివారు చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చినా తీసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నర్సింహ, డీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సే షరీఫ్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


ఉర్సే షరీఫ్ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్

తాండూరు, ఆగస్టు 10: తాండూరు పట్టణంలో సయ్యద్ అబ్దుల్ కరీం సాహెబ్ ఖిల్లా ఉర్సే షరీఫ్ ఉత్సవాల వాల్ పోస్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ శనివారం దర్గా ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు హబీబ్ లాల, ప్రతినిధులు వాలీ పాష, సలీం పాష, తదితరులు పాల్గొన్నారు.

13న విజయోత్సవ ర్యాలీ

కొడంగల్, ఆగస్టు 10: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఈ నెల 13న హైదరాబాద్‌లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ తెలిపారు. కొడంగల్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. 30 సంవత్సరాలుగా న్యాయమైన దండోరా ఉద్యమానికి సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం జరిగిందన్నారు. వర్గీకరణతో మాదిగ, 57 ఉపకులాలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన వాటా దక్కేందుకు అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌లో జరిగే విజయోత్సవ ర్యాలీకి నియోజకవర్గం లోని ఎమ్మార్పీఎస్ నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మల్కప్ప, జాని, శ్రీగౌడ్, శేఖర్, వెంకట్, బన్నీ, అజయ్, వెంకట్, ప్రకాశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ గీత సెల్ జిల్లా కోకన్వీనర్‌గా శ్రీకాంత్‌గౌడ్


శ్రీకాంత్ గౌడ్

ధారూరు, ఆగస్టు 10: బీజేపీ ఓబీసీ గీత సెల్ (గౌడ్ విభాగం) జిల్లా కో కన్వీనర్‌గా ధారూరుకు చెందిన శ్రీకాంగ్ గౌడ్‌ను శనివారం నియమించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి వికారాబాద్ పట్టణంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందించారు. కాగా తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతతో గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ గీత సెల్ రాష్ట్ర కన్వీనర్ పి.వెంకటేష్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకుడు పాండుగౌడ్, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి, ఆగస్టు 10: పరిగి పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బహర్‌పేట్, హనుమాన్ ఆలయం, వాగ్దేవి హాస్పిటల్ తదితర ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రైం కార్నర్

దొంగ బాబాల హల్‌చల్

● బురిడి కొట్టించే ప్రయత్నం ● పోలీసులకు అప్పగించిన స్థానికులు


పట్టుబడిన దొంగ బాబాలు

పరిగి, ఆగస్టు 10: మండలంలోని నస్కల్‌లో దొంగ బాబాలు హల్‌చల్ చేశారు. శాంతి పూజ చేస్తామంటూ బంగారు ఉంగరం, డబ్బులు తీసుకొని ఉడాయించే ప్రయత్నం చేయగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. నస్కల్ గ్రామానికి చెందిన శ్రీధర్ అనే వ్యక్తి ఫాస్ట్‌ఫుడ్ నిర్వహిస్తుంటాడు. గుజరాత్ పాసింగ్ ఉన్న ఓ బొలేరో వాహనంలో ముగ్గురు దొంగ బాబాలు, ఓ డ్రైవర్ అందరూ కలిసి శ్రీధర్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో భోజనం చేశారు. అనంతరం డబ్బులు ఇవ్వకుండా వెళ్తుండటంతో నిర్వాహకుడు శ్రీధర్ వారిని ఆపాడు. దీంతో వారు 'నీకు దరిద్రం పట్టింది. నీకు శాంతి పూజ చేస్తాం' అంటూ నమ్మబలికి అతన్ని బుట్టలో వేసుకున్నారు. ఓ రాగి చెంబు తెప్పించి అందులో నీళ్లుపోసి ఓ బంగారు ఉంగరాన్ని అందులో వేసి తెల్ల గుడ్డకట్టి రేపు ఉదయం తెరిచి చూడమని హితబోధ చేశారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోతుండగా వెంటనే తెరుకున్న శ్రీధర్ చెంబులో చూడగా రాగి ఉంగరం ఉంది. ఇదేంటని ప్రశ్నించేలోపు పారిపోయే ప్రయత్నం చేశారు. గ్రామస్థులు బాబాలను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ముగ్గురు నకిలీ బాబాలు, ఓ డ్రైవర్ గుజరాత్ పాసింగ్ బొలేరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అట్టి వాహనంలో పూజా సామగ్రిని గుర్తించారు. ఇలాంటి దొంగ బాబాల బురిడీ మాటలు విని మోసపోవద్దని పోలీసులకు అప్పగించినట్లు బాధితుడు శ్రీధర్ తెలిపాడు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత


మృత్యువాతపడిన పాడిగేదె

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 10: విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాతపడింది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రీ-భువనగిరి జిల్లా, వెంకిర్యాల్‌కు చెందిన గడగొట్టి నర్సింహాకు చెందిన ఐదు పాడి గేదెలు రోజూవారీగా ఘట్‌కేసర్ మండలంలోని మాదారం సర్వేనెంబర్ 225లో మేతకు తీసుకొస్తాడు. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభం వంగి తీగలు కిందపడ్డాయి. పాడిగేదెలు ప్రమాదవశాత్తు తీగకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాయి. దీంతో పాడిగేదె అక్కడికక్కడే మృతిచెందింది. వారం రోజుల క్రితమే రూ.లక్షా 50వేలకు గేదెను కొనుగోలు చేసినట్లు బాధితుడు వాపోయాడు. బాధితుడు 100కు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నలుగురిపై చీటింగ్ కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 10: చైన్‌సిస్టం స్కీంలో చేర్పించి మోసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన సైనోజు మనోరమ అనే మహిళ స్పాట్‌లోన్ క్లౌడ్ టెక్నిక్ కంపెనీలో చేరి పీఆర్‌ఎం ప్రసాద్ ద్వారా రూ.1600లకు ఐడీ తీసుకుంది. మరో ఇద్దరిని చేర్పిస్తే లాభాలు వస్తాయని కంపెనీ నిబంధనల ప్రకారం రూ.3200 చెల్లించి మరో ఇద్దరిని సంస్థలో చేర్పించింది. వీరిద్దరూ మరో నలుగురిని చేర్పించి, మొత్తం ఏడుగురు సభ్యులతో రూ.12000 చెల్లించగా ఎలాంటి లాభం రాలేదు. దీంతో సంస్థలప్రతినిధులను సంప్రదించగా ముఖం చాటేశారు. డబ్బులు కట్టినవారు వేధింపులకు దిగడంతో మానసిక వేదనకు గురైన మనోరమ కంపెనీ ఎండీ కాకుమను క్రాంతికుమార్, ప్రతినిధులు కొండవీటి సాయిప్రశాంత్, నర్రిశెట్టి పావనిలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూమ్ యాప్ ద్వారా కంపెనీలో చేర్పించి ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దేశవ్యాప్తంగా పదిలక్షల మందిని స్పాట్‌లోన్ క్లౌడ్ టెక్నిక్ కంపెనీ వారు డబ్బులు కట్టించుకొని మోసం చేశారని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూతగాదాలో కేసులు నమోదు

తాండూరు, ఆగస్టు 10: ఓస్థలం విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ, బీఆర్‌ఎస్ పార్టీ నేతలపై పరస్పర కేసులు నమోదయ్యాయి. ఈస్థల వివాదం గతనెల రోజులుగా కొనసాగి చివరకు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. ఇరుపక్షాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. తాండూరు పట్టణం పాతకుంట సమీపంలోని వినాయక కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ ముందు గల సర్వేనంబర్ 142లో ఎకరా భూమి తమదంటే తమదని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు గొడవకు దిగారు. ఈ క్రమంలో డివిజనల్ సర్వేకూడా చేశారు. అయితే సర్వేప్రకారం తన పేరిట 10 గుంటలు, మేనమామ పేరిట 15గుంటలు, బావ మరిదిపై 15గుంటలు భూమి ఉందని ఎం.నరేందర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఐ సర్వే చేపట్టి ఈ స్థలం స్వాధీనం చేసుకొని కట్టెలను పెన్సింగ్ వైరును ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపాడు. అయితే విద్యావేత్త రంగారావు, కాంగ్రెస్ కౌన్సిలర్ విజయదేవి, కూతురు సింధూలు తమ భూమిలో అక్రమంగా చొరబడి కట్టెలు, ఫెన్సింగ్ వైర్లను తొలగించి నష్టం కలిగించారని ఆరోపించాడు. తనను దుర్భాషలాడుతూ చంపేస్తామని బెదిరిస్తున్నారని పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మరోవైపు ఇదే స్థలానికి సంబంధించి కాంగ్రెస్ మహిళ కౌన్సిలర్ విజయదేవి ఫిర్యాదు మేరకు బీఆర్‌ఎస్ మాజీ పట్టణ అధ్యక్షుడు గద్దె శ్రీనివాస్‌చారి, మరికొందరిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా శనివారం కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ విజయాదేవి, కుటుంబసభ్యులపై కేసు నమోదైంది. ఆదర్శనగర్‌లో ఉన్న ఈ భూమి వివాదం రోజుకోమలుపు తిరుగుతోంది.

పాఠశాల ఎదుట నీరు నిల్వకుండా మరమ్మతులు


పాఠశాల గేటు ఎదుట నాపరాతి ముక్కలు పరుస్తున్న జేసీబీ

తాండూరు రూరల్, ఆగస్టు 10: మండలంలోని మల్కాపూర్ ప్రాథమిక పాఠశాల ఎదుట గుంతలో వర్షం నీరు నిల్వకుండా తాత్కాలిక మరమ్మతులు చేశారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పాఠశాల ఎదుట నీరు నిలిచి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలోకి వెళ్లాలన్నా, రావాలన్నా నిలిచిన నీటిలో నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థుల ఇబ్బందులు గుర్తించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబ్యానాయక్, గతంలో పనిచేసిన హెచ్‌ఎం నాగప్ప ఈ విషయాన్ని మాజీ సర్పంచ్ ఎస్.విజయలక్ష్మీ పండరి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆమె నాపరాతి ముక్కలను తెప్పించి పాఠశాల ఎదుట నీరు నిలుస్తున్న ప్రదేశంలో మరమ్మతులు చేయించారు. దీంతో విద్యార్థులకు కొంతమేరకు ఇబ్బందులు తొలిగాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం


దొంగ ఎన్కెపల్లిలో మురుగు కాల్వల దుస్థితి

దోమ, ఆగస్టు 10: మండలంలోని దొంగ ఎన్కెపల్లి గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీల్లో మురుగు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగుకాల్వల్లో నీరు నిలిచి ఉండటంతో దోమలు, ఈగల బెడద కారణంగా రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోయారు. పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.